క్లుప్తంగా

చేవెళ్ల ఇన్‌చార్జి ఎంపీడీఓగా రాజ్‌కుమార్



చేవెళ్ల: చేవెళ్ల ఇన్‌చార్జి ఎంపీడీఓగా రాజ్‌కుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుత ఎంపీడీఓ హిమబిందు మెటర్నిటీ సెలవులు తీసుకోవడంతో ఆమె స్థానంలో ఇన్‌చార్జి ఎంపీడీఓగా సూపరింటెండెంట్ రాజ్‌కుమార్‌కు బాధ్యతలు అప్పగించారు.

ముగిసిన రోడ్డు భద్రతా వారోత్సవాలు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

షాద్‌నగర్: నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా వారి స్వచ్ఛత పక్వాడ క్యాంపెయిన్ కార్యక్రమంలో భాగంగా షాద్‌నగర్ శివారులో టోల్‌గేట్ వద్ద నిర్వహించిన రోడ్డు భద్రతా వారోత్సవాలు బుధవారంతో ముగిసాయి. ఈ సందర్భంగా ఐసద్దక్-జడ్చర్ల ఎక్స్‌ప్రెస్ ప్రైవేట్ లిమిటెడ్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన రోడ్డు భద్రతా వారోత్సవాల ముగింపు సందర్భంగా వాహనదారులకు పలు సూచనలు చేశారు. సీటు బెల్టు పెట్టుకుని, హెల్మెట్ ధరించి ప్రయాణించిన వారికి బిస్కెట్లు, పండ్లు పంపిణీ చేశారు. అనంతరం రోడ్డు భద్రతపై తీసుకోవాల్సిన జాగ్రత్తలకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో షాద్‌నగర్ ట్రాఫిక్ ఎస్ఐ నాయక్, టోల్ ప్లాజా నిర్వాహకులు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి సహకరించాలి

నర్సప్పగూడ సర్పంచ్ అశోక్



మాట్లాడుతున్న సర్పంచ్ అశోక్

నందిగామ: గ్రామాభివృద్ధికి ప్రతీ ఒక్కరు సహకరించాలని నర్సప్పగూడ సర్పంచ్ గోవిందు అశోక్ అన్నారు. మండల పరిధిలోని నర్సప్పగూడలో బుధవారం సర్పంచ్ అధ్యక్షతన గ్రామసభను నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ అశోక్ మాట్లాడుతూ.. ఉన్నతాధికారుల ఆదేశానుసారంగా వచ్చే ఆర్థిక సంవత్సరంలో గ్రామంలో చేపట్టనున్న పలు అభివృద్ధి పనుల గుర్తింపు కోసం సమావేశం నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కాట్న శేఖర్, ఎంపీటీసీ సభ్యురాలు కలమ్మ, పంచాయతీ కార్యదర్శి జానకీ రాం, వార్డు సభ్యులు సత్యం, గ్రామస్తులు భూపాల్, నర్సింహ, శేఖర్, వెంకటేశ్, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉదారత చాటుకున్న ఉపాధ్యాయులు

విద్యార్థి కుటుంబానికి ఆర్థికసాయం



ఆర్థికసాయం చేస్తున్న ఉపాధ్యాయులు

కొత్తూరు: బైకు ప్రమాదంలో మృతి చెందిన కొత్తూరు జెడ్పీహెచ్ఎస్ పాఠశాలకు చెందిన విద్యార్థి విష్ణువర్ధన్ కుటుంబానికి ఆర్థిక సాయం చేసి ఉపాధ్యాయులు ఉదారత చాటుకున్నారు. ఇందులో భాగంగా బుధవారం నందిగామ మండలం రంగాపూర్ గ్రామంలోని విద్యార్థి ఇంటికి వెళ్లిన ఉపాధ్యాయులు కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.10 వేలు ఆర్థికసాయం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం కె.భాగ్యమ్మ, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

బీరప్ప కురుమ సంఘం అధ్యక్షుడిగా శంకర్

షాబాద్: కురుమలు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా అన్ని రంగాలలో అభివృద్ధి సాధించాలని ముద్దెంగూడ సర్పంచ్ కుర్వ జయమ్మ అన్నారు. బుధవారం మండల పరిధిలోని ముద్దెంగూడలో నూతన గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బీరప్ప కురుమ సంఘం గ్రామ నూతన కమిటీకి అధ్యక్షుడిగా శంకర్ కురుమ, ఉపాధ్యక్షుడిగా నవీన్ కురుమ, సెక్రటరీగా నాగేశ్ కురుమ, డైరెక్టర్లుగా చంద్రయ్య కురుమ, మల్లేశ్, రాములమ్మ, మల్లమ్మను ఎన్నుకుని ప్రమాణ స్వీకారం చేయించారు. కురుమ సంఘం నాయకుడు సుదర్శన్, ఉపసర్పంచ్ ప్రతాప్‌రెడ్డి, ఎన్నికల అధికారి ఆనంద్, రామ్ తదితరులున్నారు.

ఆర్థికసాయం అందజేత

కొందుర్గు: చిన్నఎల్కిచర్ల గ్రామానికి చెందిన మరాఠి రామచంద్రయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. పరామర్శించిన వారిలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కృష్ణారెడ్డి, నాయకులు మల్లేశ్ గౌడ్, ఆంజనేయులు, సాయిలు, శివరాజ్ యాదవ్, రాజ సిద్దు, గోపి, రాములు ఉన్నారు.

పరిశ్రమలకు బోర్డులు ఏవీ..?

- నిబంధనలకు తూట్లు
- పట్టించుకోని అధికారులు



నర్సప్పగూడ శివారులో బోర్డు లేకుండా కొనసాగుతున్న పరిశ్రమ

నందిగామ: రూ.కోట్లు టర్నోవర్ చేసే భారీ పరిశ్రమలు ఒక వైపు.. అనుదినం టన్నుల కొద్దీ ఐరన్ ఉత్పత్తులు చేసే పరిశ్రమలు మరో వైపు.. ప్లేవుడ్ కంపెనీలు, ఫార్మా పరిశ్రమలు, అల్యూమినియం పరిశ్రమలు.. మసాల దినుసులు, సిలిండర్ పరిశ్రమలు, టెక్స్‌టైల్ పరిశ్రమలు ఇలా ఎన్నో పరిశ్రమలకు నెలవు నందిగామ. కానీ పలు పరిశ్రమల యాజమానులు తమ పరిశ్రమకు సంబంధించిన బోర్డులను ఏర్పాటు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు.. పట్టించుకోవాల్సిన అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడంతో పోవడంతో పారిశ్రామికవేత్తలు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు..

అంతర్యమేమిటో..?

పరిశ్రమలో ఏమి ఉత్పత్తులు తయారవుతున్నాయో బయటి వారకు ఏమాత్రం తెలియడం లేదు. స్థానికులకు పరిశ్రమల పేరు తెలియదంటే యజమానుల తీరు ఎలా ఉందో అవగతమవుతోంది. పరిశ్రమకు చుట్టూ ప్రహరీ నిర్మించుకుని వాచ్‌మెన్‌లను పెట్టుకుని అందులో ఏ ఉత్పత్తులు తయారవుతున్నాయో తెలియకుండా యజమాన్యాలు జాగ్రత్త పడటంలో ఆంతర్యమేమిటి అని ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. చట్ట వ్యతిరేక, అనుమతులు లేని ఉత్పత్తులు చేపట్టుతున్నారా అనే విషయం ఏ మాత్రం తెలియడం లేదు. నిబంధనలు పాటించాల్సిన పరిశ్రమల యాజమాన్యాలు అధికారులను ముడుపులతో సంతృప్తి పరచడంతో వారు పట్టించుకోవడం లేదని ఆరోపణలు వస్తున్నాయి.

నిబంధనలు ఇలా

ఓ పరిశ్రమను ఏర్పాటు చేయాలంటే మొదటగా పరిశ్రమ పేరు రిజిస్టర్ చేసి పరిశ్రమ ఏర్పాటు చేసే స్థలంలో కంపెనీ యాక్ట్ ప్రకారం నిర్ణీత సైజు ప్రకారం పరిశ్రమ పేరు, ఉత్పత్తులు, సర్వే నెంబర్, పరిశ్రమ హెడ్ ఆఫీస్ చిరునామా, కాలుష్య నియంత్రణ బోర్డు అధికారి పేరు, ఫోన్ నెంబరు, కార్యాలయ చిరునామా, ఫిర్యాదు చేయాల్సిన అధికారి, కార్యాలయం పేర్లు, ఫోన్ నెంబర్లు నమోదు చేయాల్సి ఉంటుంది. సంభందిత వివరాలతో కూడిన బోర్డులను పరిశ్రమ వెలుపల అందరికి కనపడేలా ఏర్పాటు చేయాలి. కాగా చాలా పరిశ్రమలు బోర్డులు ఏర్పాటు చేయలేదు. మరికొన్ని పరిశ్రమలు ఏర్పాటు చేసినా కంపెనీ పేరు రాసి చేతులు దులుపుకుంటున్నారు.

గతంలో చోటు చేసుకున్న అక్రమాలు

- పాత జాతీయ రహదారిపై ఉన్న ఓ ఐరన్ పరిశ్రమలో అనుమతులు లేకుండా ఇతర కంపెనీకి చెందిన బ్రాండ్‌లు అక్రమంగా వినియోగిస్తూ ఉత్పత్తులను చేపడుతున్న విషయమై గతంలో ఢిల్లీ నుంచి ప్రత్యేక బృందం వచ్చి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుంది.
- అయ్యప్ప స్వామి ఆలయానికి సమీపంలో ఓ పరిశ్రమలో అక్రమంగా గుట్కా, పొగాకు ఉత్పత్తులను చేపడుతుండగా గతంలో ఎస్ఓటీ పోలీసులు పెద్ద ఎత్తున గుట్కాప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు.
- పృథ్వీకాలనీకి వెళ్లే దారిలో ఓ మూత పడిన పరిశ్రమలో నకిలీ పత్తి విత్తనాలను పట్టుకున్నారు.
- ఇటీవల మేకగూడ శివారులోని ఓ ప్లైవుడ్ పరిశ్రమలో వ్యవసాయానికి వినియోగించే యూరియా బస్తాలను పోలీసులు పట్టుకున్నారు.

అధికారులు ఏం చేస్తున్నట్లు..?

నిరంతరం పరిశ్రమలను తనిఖీ చేసే అధికారులకు పరిశ్రమల బోర్డుల ఏర్పాటు విషయం ఎందుకు పట్టించుకోవడం లేదని పలువు ప్రశ్నిస్తున్నారు. అటు కాలుష్య నియంత్రణ బోర్డు అధికారులు గానీ, ఇటు కార్మికశాఖ అధికారులు గానీ, స్థానిక అధికారులు గానీ ఇప్పటి వరకు బోర్డులు ఏర్పాటు చేయని పరిశ్రమలపై తగు చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. నిరంతరం నిఘా పెట్టాల్సిన అధికారులు పట్టించుకోలేకపోవడంలో ఆంతర్యామేమిటో సంభంధిత ఉన్నతాధికారులకే తెలియాలి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పరిశ్రమలకు నిబంధనల ప్రకారం బోర్డులు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

చర్యలు తీసుకోవాలి



నందిగామ, కొత్తూరు ప్రాంతాల్లో వెలసిన పరిశ్రమల్లో బోర్డులు ఏర్పాటు చేయడం లేదు. చర్యలు తీసుకోవాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో పరిశ్రమలలో ఏం జరుగుతుందో బయటి ప్రపంచానికి తెలియడం లేదు. అధికారులు స్పందించి బోర్డులను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలి.

– బీస సాయిబాబు, జిల్లా ఉపాధ్యక్షుడు, సీఐటీయూ

నోటీసులు జారీ చేస్తాం

పరిశ్రమల యజమానులు బోర్డులు ఏర్పాటు చేయకపోతే పంచాయితీలు పరిశ్రమల యజమానులకు నోటీసులు జారీ చేయాలి. అందుకు సంబంధించి పంచాయతీ కార్యదర్శులకు సూచనలు చేస్తాం. అదే విధంగా పరిశ్రమల అధికారులు సైతం చర్యలు తీసుకోవాలి.

– గిరిరాజ్, ఎంపీఓ, నందిగామ

వందశాతం పన్నులు వసూలు చేయాలి

ఎంపీడీఓ వినయ్‌కుమార్



మాట్లాడుతున్న ఎంపీడీఓ వినయ్‌కుమార్

షాద్‌నగర్: గ్రామాల్లో ఇంటి, నల్లా పన్నులను వంద శాతం వసూలు చేయాలని ఎంపీడీఓ వినయ్‌కుమార్ సూచించారు. బుధవారం పట్టణంలోని మండలపరిషత్ సమావేశ మందిరంలో అధికారులతో వారంతపు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ వినయ్‌కుమార్ మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రజలు చెల్లించే పన్నులతోనే గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతుందని అన్నారు. గ్రామాల్లో గృహ యజమానుల నుంచి ఇంటి పన్నులు, నల్లా పనులను నిర్దేశించిన గడువులోపు వంద శాతం పూర్తి చేయాలని సూచించారు. పన్నుల వసూళ్లలో పంచాయితీ అధికారులు నిర్లక్ష్యం వహించొద్దన్నారు. ఉపాధి హామీ కూలీలకు జాబ్ కార్డులు జారీ చేయాలని, ఈ కార్డులను ఆధార్ సీడింగ్‌పూర్తి చేయాలని సూచించారు. గ్రామాల్లోని నర్సరీల్లో పెంచే మొక్కలు ఎండిపోకుండా చూడాల్సిన భాధ్యత అధికారుల పై ఉందన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కంటి వెలుగు కార్యక్రమం పై ప్రజల్లో అవగాహన కల్పించి విజయవంతం చేయాలని సూచించారు. అధికారులందరు సమన్వయంతో ముందుకు సాగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ కల్యాణి, ఏపీఓ అరుణ, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి రూ.లక్ష విరాళం



విరాళం అందజేస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు అవినాశ్‌రెడ్డి

షాబాద్: సరస్వతి శిశు మందిరం పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తానని షాబాద్ జెడ్పీటీసీ సభ్యుడు పట్నం అవినాశ్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన మండల కేంద్రంలో సరస్వతి శిశుమందిరం పాఠశాలకు రూ.లక్ష విరాళం అందజేశారు. కొంత కాలంగా ఆర్థిక ఇబ్బందులతో ఉన్న పాఠశాల పరిస్థితిని తెలుసుకున్న అవినాశ్‌రెడ్డి పాఠశాల యాజమాన్యం కోరిన వెంటనే విరాళం అందజేశారు. ఈ సందర్భంగా అవినాశ్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎంతో మంది పేద విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దిన ఘనత షాబాద్ శిశుమందిరం పాఠశాలకు ఉందని గుర్తుచేశారు. ముమ్ముందు పాఠశాల అభివృద్ధికి మరింత సహకారం అందిస్తానన్నారు. ఇప్పటికే మంత్రి కేటీఆర్ స్ఫూర్తితో మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు రూ.25లక్షల సొంత నిధులతో గిఫ్ట్ ఏ స్మైల్ కింద బెంచీలను అందిస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సహకార సంఘం చైర్మన్ చల్లా శేఖర్‌రెడ్డి, సంకెపల్లిగూడ సర్పంచ్ కుమ్మరి దర్శన్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రమేశ్, శ్రీరాములు, పాఠశాల అధ్యక్ష, కార్యదర్శులు కృష్ణారెడ్డి, గోపాల్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు రమేశ్‌గౌడ్, నారాయణ, యాదవరెడ్డి, గౌరిశంకర్, యాస మల్లారెడ్డి, రాందేవ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

దశలవారీగా సమస్యల పరిష్కారం

సర్దార్‌నగర్ సర్పంచ్ స్వరూప



మాట్లాడుతున్న సర్పంచ్ స్వరూప

షాబాద్: ప్రభుత్వ నిధులతో గ్రామ సమస్యలను దశల వారీగా పరిష్కరిస్తామని సర్దార్‌నగర్ సర్పంచ్ మునగపాటి స్వరూప అన్నారు. బుధవారం మండల పరిధిలోని సర్దార్‌నగర్ పంచాయతీ కార్యాలయంలో వార్డు సభ్యులతో సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇప్పటికే గ్రామంలోని పలు కాలనీల్లో యూజీడీ, సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టామన్నారు. వచ్చే రెండేళ్లలో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, జెడ్పీటీసీ, ఎంపీపీల సహకారంతో మరిన్ని నిధులు తీసుకువచ్చి ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతామన్నారు. తెలంగాణ ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులంతా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. హరితహారంలో భాగంగా నాటిన మొక్కలను సంరక్షించాలని సూచించారు. ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ మధుసూదన్‌రెడ్డి, ఉపసర్పంచ్ ఇందిర, వార్డు సభ్యులు నర్సింలు, కృష్ణ, కలీం తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

పీసీసీ రాష్ట్ర కార్యదర్శి శంకర్



విజేతలకు బహుమతులు అందజేస్తున్న శంకర్

కేశంపేట: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని పీసీసీ రాష్ట్ర కార్యదర్శి వీర్లపల్లి శంకర్ అన్నారు. మండల పరిధిలోని కొత్తపేట గ్రామంలో మాజీ సర్పంచ్ పట్లూరి శివలింగప్ప జ్ఞాపకార్థం క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో వీర్లపల్లి శంకర్ విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువతకు చదువుతోపాటుగా క్రీడల్లోనూ రాణించాలన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే యువతకు ఉపయోగపడే కార్యక్రమాలు చేడపతామన్నారు. ప్రతీ ఒక్కరు కాంగ్రెస్ పార్టీ గెలుపునకు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో జగదీశ్వర్, శ్రీధర్ రెడ్డి, గిరియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పాం పంటలకు తెలంగాణ అనుకూలం

ఏజీవర్సిటీ: తెలంగాణ భూములు ఆయిల్‌పాం పంటలకు అనుకులంగా ఉన్నాయని ప్రస్తుత పరిస్థితుల్లో ఆయిల్‌పాం పంటలు సాగుచేయడం రైతులకు లాభదాయకంగా ఉంటుందని కొండలక్ష్మణ్ ఉద్యానవన విశ్వవిద్యాలయం వీసీ నీరజాప్రభాకర్, మలేషియాకు చెందిన నూకియా అకాడమీ ఆఫ్ సైన్స్ చైర్మన్ డాక్టర్ రాజనాయుడు అన్నారు. బుధవారం రాజేంద్రనగర్‌లోని కొండలక్ష్మణ్ ఉద్యానవన విశ్వవిద్యాలయంలో ఆయిల్‌పాం సాగులో మెలకువలు, వాతావరణ మార్పులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ వాతావరణం ఈ పంటల సాగుకు అనుకులంగా ఉంటుందన్నారు. అందుకు అవసరమైన నీటి లభ్యత, ఉష్ణోగ్రత తదితర అనుకుల వాతావరణం మన రాష్ట్రంలో ఉందన్నారు. ఆయిల్‌పాం సాగులో అధునాతన పద్దతులు పాటించాలని డ్రిప్ ఇరిగేషన్ ద్వారా పర్టిగేషన్ చేయడం ద్వారా మూడేళ్లలో పంట చేతికి వస్తుందని తెలిపారు. ఈ మూడేళ్లు రైతులు నష్టపోకుండా అంతర పంటలుగా కూరగాయలు, పసుపు వంటివి పంటలు సాగుచేసి ఆదాయాన్ని పొందవచ్చునని తెలిపారు. ప్రస్తుతం దేశంలో ప్రతి ఒక్కరు సంవత్సరానికి 19 కిలోల పాంఆయిల్ తీసుకుంటున్నారని, దీనికి అనుగుణంగా 25 మిలియన్ టన్నుల పామాయిల్ అవసరమన్నారు. దీనికి రైతులకు ఉద్యాన వర్సిటీ శాస్త్రవేత్తలు సూచనలు సలహాలు ఇస్తూ రైతులకు వెన్నుదన్నుగా ఉంటుందని వీసీ నీరజప్రభాకర్ తెలిపారు.

విద్యుత్‌శాఖ ఏఈని నియమించండి

- మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి

శంకర్‌పల్లి: డివిజన్ పరిధిలో విద్యుత్ శాఖకు ఇన్‌చార్జి ఏఈని నియమించడంతో విద్యుత్ సమస్యలు తీవ్రమయ్యాయని మున్సిపల్ చైర్‌పర్సన్ సాత విజయలక్ష్మి ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. శంకర్‌పల్లి విద్యుత్ శాఖ పరిధిలోని మున్సిపాలిటీ పరిధిలోని 15 వార్డులు, 25 గ్రామ పంచాయతీలుండగా వీటి పరిధిలో నిత్యం విద్యుత్ సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. ఇన్‌చార్జి ఏఈ పట్టించుకోకపోవడంతో విద్యుత్ తీగల మరమ్మతులు, లోఓల్టేజీ సమస్యలు తరచూ వస్తున్నాయన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి శంకర్‌పల్లి విద్యుత్ శాఖకు పూర్తిస్థాయి ఏఈని నియమించాలని డిమాండ్ చేశారు.

హుక్కా సెంటర్‌పై దాడి

రాజేంద్రనగర్: అనుమతులు లేకుండా హుక్కా సెంటర్ నిర్వహిస్తున్న యజమానితో పాటు 10 మందిని శంషాబాద్ ఎస్ఓటీ, రాజేంద్రనగర్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల కథనం మేరకు.. హ్యాపీహోమ్స్ ప్రాంతానికి చెందిన మంజూర్ కేఫ్ బ్లాక్ యార్డ్ పేరిట హుక్కా సెంటర్‌ను నిర్వహిస్తున్నట్లు స్థానికులు సమాచారం అందించడంతో రాజేంద్రనగర్, ఎస్ఓటీ పోలీసులు బుధవారం ఉదయం హుక్కా సెంటర్‌పై దాడి చేశారు. నిర్వాహకుడితో పాటు హుక్కా సెంటర్‌కు వచ్చిన పది మంది యువకులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు.

తప్పిపోయిన బాలుడు తల్లికి అప్పగింత

బండ్లగూడ: తప్పిపోయిన బాలుడిని అంగన్‌వాడీ టీచర్ గుర్తించి తమ తల్లిదండ్రులకు అప్పగించింది. వివరాల్లోకి వెళితే.. బిహార్ రాష్ట్రానికి చెందిన దివ్వాత్‌యాదవ్, ప్రియాంకయాదవ్ దంపతులు బండ్లగూడకు వలసవచ్చారు. బుధవారం వారి కుమారుడు అన్నూష్‌యాదవ్ ఆడుకుంటూ తప్పిపోయాడు. ఇంటిని గుర్తించలేక ఏడుస్తూ రోడ్డుపై కూర్చున్న అతడిని గమనించిన అంగన్‌వాడీ టీచర్ నాగలక్ష్మి అతడి వద్దకు వెళ్లి వివరాలు అడిగి తెలుసుకుంది. తల్లి, తండ్రి పేరు చెప్పిన ఇంటి చిరునామా చెప్పలేకపోవడంతో పరిసర ప్రాంతాల్లో వాకాబు చేసింది. చివరకు సమాచారం తెలుసుకుని తల్లి ప్రియాంకయాదవ్‌కు అన్నూష్‌ను అప్పగించింది.

శంషాబాద్ కమిషనర్‌గా భోగీశ్వర్లు

శంషాబాద్: శంషాబాద్ మున్సిపల్ కమిషనర్‌గా భోగీశ్వర్లు నియమితుయ్యారు. ఈ మేరకు పురపాలక శాఖ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇక్కడ పనిచేసిన సాబేర్ అలీ తుర్కయంజాల్ మున్సిపాలిటీకి బదిలీ అయ్యారు. దుండిగల్ కమిషనర్‌గా పనిచేస్తున్న భోగీశ్వర్లు శంషాబాద్ మున్సిపాలిటీ ఏర్పాటైన తర్వాత మూడో కమిషనర్‌గా నియమితులయ్యారు.

పకడ్బందీగా 'కంటి వెలుగు'

ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

- నేటి నుంచి వైద్య పరీక్షలు



చేవెళ్ల: ఆలూరు గ్రామంలో ట్రయల్‌రన్



కేశంపేట: .ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు



శంకర్‌పల్లి: జనవాడలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

చేవెళ్ల: కంటి వెలుగు కార్యక్రమం గురువారం నుంచి అధికారికంగా ప్రారంభం కానున్న నేపథ్యంలో ఎంపిక చేసిన గ్రామాల్లో అధికారులు బుధవారం ట్రయల్‌రన్ నిర్వహించినట్లు డిప్యూటీ డీఎంహెచ్ఓ దామోదర్ తెలిపారు. మండల పరిధిలోని ఆలూరు పీహెచ్‌సీ పరిధిలోని ఆలూరు, అంతారం గ్రామాల్లో ట్రయల్ రన్ నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ డీఎంహెచ్ఓ మాట్లాడుతూ.. కంటి వెలుగు కార్యక్రమ ప్రారంభోత్సవాలను ఘనంగా నిర్వహించాలన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సకాలంలో హాజరవ్వాలని కోరారు. జనాభా ప్రతిపాదికన నిర్దేశించిన ప్రకారం 150 మందిని పంపిస్తారని వారికి కంటి పరీక్షలు నిర్వహించి కావాల్సిన వారికి కంటి అద్దాలను అందజేస్తారని సకాలంలో సిబ్బంది ఈ శిబిరాలకు హాజరు కావాల్సి ఉంటుందని తెలిపారు. ప్రతీ ఒక్కరు పరీక్షలు చేయాలని చెప్పారు.

సద్వినియోగం చేసుకోవాలి

షాబాద్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కంటి వెలుగు స్పెషలాఫీసర్ శ్రీకాంత్‌రెడ్డి, షాబాద్ ఎంపీడీఓ అనురాధ అన్నారు. బుధవారం మండల పరిధిలోని మన్మర్రి గ్రామంలో కంటి వెలుగు కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం లబ్ధిదారులకు కంటి వెలుగు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రభుత్వం గురువారం నుంచి రెండో విడత కంటి వెలుగు కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని తెలిపారు. దృష్టి లోప నివారణకు రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని తీసుకువచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సుహాసిని, డాక్టర్ శ్రీనివాస్ తదితరులున్నారు.

ప్రణాళిక సిద్ధం చేసుకోవాలి

మొయినాబాద్: కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని చేవెళ్ల ఆర్డీఓ వేణుమాధవరావు అన్నారు. బుధవారం మండల కేంద్రంలో కంటి వెలుగు ట్రయల్ రన్ నిర్వహించారు. చేవెళ్ల డివిజన్ వైద్యాధికారి దామోదర్‌తో కలిసి ఆయన కంటి వెలుగు కార్యక్రమం ఏర్పాట్లు, ట్రయల్ రన్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 18 సంవత్సరాలు నిండిన ప్రతీ ఒక్కరికి కంటి పరీక్షలు నిర్వహించాలన్నారు. రోజువారీగా ఎంత మందికి కంటి పరీక్షలు నిర్వహించాలో ముందే ప్రణాళిక సిద్ధం చేసుకోవాలన్నారు. కంటి పరీక్షలు చేసిన అనంతరం అవసరమైన మందులు, కంటి అద్దాలు అందుబాటులో ఉండేలా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ అశోక్‌కుమార్, ఎంపీడీఓ సంధ్య, వైద్యాధికారులు శ్రీనివాస్, వాణి, సీహెచ్ఓ నర్సింగ్‌రావు, హెల్త్ సూపర్‌వైజర్లు, సిబ్బంది ఉన్నారు.

ప్రత్యేక చర్యలు చేపట్టాలి

శంకర్‌పల్లి: కంటి వెలుగు కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని శంకర్‌పల్లి ఎంపీడీఓ వెంకయ్యగౌడ్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని జనవాడ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు కార్యక్రమం ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగ్రా ట్రయల్‌రన్ నిర్వహించారు. కంటి సమస్యలు ఉన్న ప్రతీ ఒక్కరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రోగులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పంచాయతీ సిబ్బంది ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. ఎంపీఓ గీత, సర్పంచ్ లలిత, టంగటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ సత్యజ్యోతి, కార్యదర్శి ప్రభాకర్ పాల్గొన్నారు.

గ్రామానికి రెండు బృందాలు

కేశంపేట: ప్రభుత్వం గురువారం నుంచి ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న రెండో విడత కంటి వెలుగు కార్యక్రమానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మండల వైద్యాధికారి నిఖిత తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ.. మండల పరిధిలోని సంగెం, కేశంపేట గ్రామాల్లో రెండు బృందాలు కంటి వెలుగు పరీక్షలు నిర్వహిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారులు కార్తీక్, అజం, ఎంపీహెచ్ఈఓ ఆంజనేయులు, ఇన్‌చార్జి ఎంపీడీఓ రవిచంద్రకుమార్‌రెడ్డి, సర్పంచ్ వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'ధరణి'తో భూ సమస్యలు

సీపీఐ నియోజకవర్గ కన్వీనర్ రామస్వామి

మొయినాబాద్ రూరల్: ధరణి పోర్టల్‌తో రైతులకు భూ సమస్యలు అధికమయ్యాయని సీపీఐ చేవెళ్ల నియోజకవర్గ కన్వీనర్ కె.రామస్వామి, కార్యదర్శి శ్రీనివాస్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని తోల్‌కట్టలో మండల కార్యదర్శి శ్రీనివాస్ ఆధ్వర్యంలో సీపీఐ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా రామస్వామి, శ్రీనివాస్ మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజావ్యతిరేక విధానాలు అవలంబిస్తున్నాయని ఆరోపించారు. ప్రజా సమస్యలకు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పేదలకు ఇచ్చిన హామీలను మరిచిన ప్రభుత్వాలకు వచ్చే ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ చేవెళ్ల మండల కార్యదర్శి సత్తిరెడ్డి, గ్రామ శాఖ కార్యదర్శి వెంకటయ్య, ఎం.డి.జిలేల్, భాగ్యమ్మ, నర్సమ్మ, అబ్దుల్, జహంగీర్, బుచ్చయ్య, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ యువతకు వాలీబాల్ పోటీలు

కొందుర్గు: నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో జిల్లేడ్ చౌదరిగూడ మండల కేంద్రంలో గ్రామీణ యువతకు క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా యువ కేంద్రం కో ఆర్డీనేటర్ విజయ్య మాట్లాడుతూ.. యువత క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని దీంతో శారీరక ధృడత్వంతోపాటు మానసికోల్లాసం పెంపొందుతుందని అన్నారు. ఈ సందర్భంగా బుధవారం ఇంద్రానగర్ ఉన్నత పాఠశాలలో వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలు గురువారం సైతం కొనసాగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ మహేశ్‌బాబు, తహసీల్దార్ విజయ్ కుమార్, ఎంఈఓ కిష్టారెడ్డి, ఎంపీఓ విజయ్ కుమార్‌పాల్, జీహెచ్ఎం విజయ తదితరులు పాల్గొన్నారు.